ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగులకు భద్రత

మంత్రి సీతక్క హామీ

హైదరాబాద్, అక్టోబరు 5 (నమస్తే తెలంగాణ) : గ్రామీణాభివృద్ధి శాఖ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఎస్ఆర్‌డీఎస్)లో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఎస్ఆర్‌డీఎస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఆర్‌డీఎస్‌లో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 3700కు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరిలో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీసు సుబార్డినేట్‌లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు ఉన్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగి కుటుంబానికి భరోసా కల్పిస్తామని చెప్పారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమిషనర్ షఫీ ఉల్లా, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రధాని మోదీకి లేదని, పదేండ్ల పాలనలో రైతులకు పైసా రుణమాఫీ చేయని ప్రధాని, తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. మహారాష్ట్ర సభలో తెలంగాణ ప్రభుత్వంపై మోదీ వ్యాఖ్యలను మంత్రి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు.

దేవాదాయ శాఖలో పదోన్నతులు

హైదరాబాద్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ): దేవాదాయ శాఖలో 33మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్- 3 ఈవోలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శనివారం సచివాలయంలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రంలో మంత్రి మంత్రి కొండా సురేఖ ఉద్యోగులకు పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్- 3 ఈవోలుగా ప్రమోషన్ పత్రాలు అందివ్వడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇప్పటికే గ్రేడ్ -1, గ్రేడ్ -2 ఈవోలుగా పలువురికి ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉద్యోగులు దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. దేవాదాయ శాఖ భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి, జియో ట్యాగింగ్‌తో ప్రభుత్వం కట్టుదిట్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని అన్నారు. కోర్టు కేసుల్లో వున్న దేవాలయ భూములకు విముక్తి ప్రసాదించేందుకు దేవాదాయ శాఖ త్వరలో లీగల్ ఆఫీసర్‌ను నియమించనుందని వివరించారు.

పీఎం యశస్వికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పీఎం యశస్విక దరఖాస్తు చేసుకోవాలని అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్‌ల కోసం బీసీ, ఈబీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కోరారు. ఎంపికైన 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.75వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు రూ.1.25 లక్షలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని, పట్టణంలో వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.1.50లక్షలకు మించరాదని వెల్లడించారు.

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): కాళోజీ యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కళాశాల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగేండ్ల బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి టీజీ-ఈఏపీసెట్-2024లో అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్సెస్ వారు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం నుంచి ఈ నెల 14 వరకు https://tsparamed.tsche.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత అర్హత ప్రమాణాల ఆధారంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక ఫైనల్ మెరిట్ స్థానం సిద్ధం చేయనున్నట్టు వివరించారు.

బోనస్‌కు 'కొలతల' కొర్రీ!

మొదటిపేజీ తరువాయి...

పరిగణించనున్నారు. ఆ ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ ఇవ్వనున్నది. కొలతలో ఏ మాత్రం తేడా వచ్చినా రైతులు తీసుకొచ్చిన ధాన్యం సన్నధాన్యంగా గుర్తించరు. ఆ రైతులకు బోనసూ ఇవ్వరు.

గింజల కొలతకు 'కాలిపర్స్'

చిన్న చిన్న వస్తువుల పొడవు, వెడల్పు కొలతలు లెక్కించేందుకు వినియోగించే 'కాలిపర్స్' పరికరాన్ని సన్నధాన్యాన్ని గుర్తించేందుకు వినియోగించనున్నారు. ఇందుకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ ఇప్పటికే భారీ సంఖ్యలో కాలిపర్స్ కొనుగోలుకు నిర్ణయించింది. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం రెండు చొప్పున కాలిపర్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 7 వేలకు పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నది. ఈ లెక్కన కనీసంగా 14 వేల కాలిపర్స్ పరికరాలు అవసరం కానున్నాయి. ఇందులో భాగంగానే ప్రస్తుతానికి 10 వేల కాలిపర్స్ సరఫరా చేయాలని మార్కెటింగ్ శాఖను కోరినట్టుగా తెలిసింది. ముందుగా ధాన్యం వచ్చే పలు జిల్లాలకు కాలిపర్స్‌ను అందించినట్టు తెలిసింది.

ఈ కొలతలుంటేనే సన్నాలు

రైతులు తీసుకొచ్చే ధాన్యంలో సన్నాలేవి? దొడ్డు రకం ఏవి? అనే అంశాన్ని తేల్చేందుకు అధికారులు కొన్ని కొలతలను నిర్ణయించారు. ఇప్పటికే ఆర్డర్ చేసిన కాలిపర్స్‌తో ఈ కొలతను లెక్కిస్తారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని కాలిపర్స్‌లో పెట్టి ఆ గింజ పొడవు, వెడల్పును లెక్కిస్తారు. ఇందుకోసం రైతు తీసుకొచ్చిన ధాన్యంలో 10 గింజలను సేకరిస్తారు. ఆ ధాన్యాన్ని ఒక ప్రత్యేకమైన పరికరంలో వేసి వాటిపై పొట్టుపోయేలా చేస్తారు. ఆ తర్వాత వచ్చినటువంటి బియ్యపు గింజను కాలిపర్స్ ద్వారా కొలతేస్తారు. ఈ కొలతలో బియ్యపు గింజ పొడవు 6 మిల్లీమీటర్ కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు 2 మిల్లీమీటర్‌కు మించొద్దు. బియ్యపు గింజ పొడవు, వెడల్పు రేషియో 2.5 మిల్లీమీటర్ కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యపు గింజ ఈ కొలతలకు సరిపోతేనే దాన్ని సన్నధాన్యంగా పరిగణిస్తారు. లేనిపక్షంలో ఆ ధాన్యాన్ని దొడ్డు రకం ధాన్యంగా పరిగణిస్తారు. ఈ కొలతల నిబంధన ప్రకారం ఉన్నటువంటి ధాన్యానికే రూ.500 బోనస్ ఇవ్వనున్నారు.

సన్న రకాలు ప్రకటించి.. మళ్లీ ఈ కొలతలేందుకు?

సన్నధాన్యానికి మాత్రమే క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే మార్కెట్లో చాలా రకాల సన్నాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏ సన్న రకాలకు బోనస్ వర్తిస్తుందో వ్యవసాయశాఖ స్పష్టతనిచ్చింది. ఇందులో భాగంగానే 33 రకాల సన్నాలను గుర్తిస్తూ జూలైలో జాబితాను విడుదల చేసింది. 33 రకాలతో పాటు బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15047, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరాం రకాలను కూడా సన్నాలుగా పరిగణించాలని సూచించింది. బోనస్ వర్తించే సన్నాల జాబితాను ప్రకటించిన ప్రభుత్వమే.. మళ్లీ ఇప్పుడు ఈ కొలతల తతంగం పెట్టడం ఏమిటి? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. సన్నరకాల్లోనే గింజల పొడవు, వెడల్పులో తేడా ఉంటుందని, అలాంటప్పుడు వాటిని సన్నాలుగా గుర్తించకపోవటం ఏమిటి? అని నిలదీస్తున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం రకం వ్యవసాయశాఖ విడుదల చేసిన సన్నాల జాబితాలో ఉన్నా.. కాలిపర్స్ కొలతలో తేడా వస్తే పరిస్థితి ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది.

బోనస్‌ను ఎగ్గొట్టేందుకే 'కొలత'ల కొర్రీనా?

సన్న ధాన్యాన్ని గుర్తించేందుకు సివిల్ సప్లై కాలిపర్స్‌తో కొలతలు వేయాలనే నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు ఇచ్చిన బోనస్ హామీని ఎగ్గొట్టేందుకే ఈ కుట్రలకు తెరతీసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సీజన్‌లో సుమారు 91 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఇందులో 44 లక్షల టన్నుల దొడ్డు రకాలు కాగా, 47 లక్షల టన్నులు సన్న ధాన్యం ఉంటుందని ఇటీవలి సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ లెక్కన 47 లక్షల టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేస్తే క్వింటాలుకు రూ.500 చొప్పున టన్నుకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.2,350 కోట్లు అవసరం అవుతాయి. ఇవి మద్దతు ధరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం ఉన్న ఆర్థిక ఇబ్బందుల్లో ఇంత భారీ మొత్తం భారం భరించడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే కొలతల కొర్రీ పెడుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంత వీలైతే అంత కోతలు కోసి బోనస్ భారాన్ని రూ.500 కోట్లకు మించనివ్వొద్దని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిసింది.

మొదటి దశలో ఆర్డర్ చేసిన కాలిపర్స్ జిల్లాలవారీగా..

జిల్లా	కాలిపర్స్ సంఖ్య
మహబూబ్‌నగర్	190
పెద్దపల్లి	350
నిజామాబాద్	500
నిర్మల్	250
సంగారెడ్డి	100
కామారెడ్డి	400
నారాయణపేట	100

విద్యుత్తు చార్జీల పెంపుపై 21 నుంచి విచారణ

రూ.1200 కోట్ల భారం మోపేందుకు డిస్కంల ప్రతిపాదన

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): వినియోగదారులపై రూ.1200 కోట్ల మేరకు విద్యుత్తు చార్జీల పెంపునకు అనుమతించాలని కోరుతూ డిస్కంలు విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్సీ)కి చేసిన ప్రతిపాదనలపై ఈ నెల 21 నుంచి 25 వరకు బహిరంగ విచారణ జరుగనున్నది. లైసెన్సింగ్‌కు కేవలం 12 రోజులు మాత్రమే ఉన్నందున పబ్లిక్ హియరింగ్ గడువును పొడగించబోమని ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు తెలిపారు. ఈఆర్సీ సలహామండలి సమావేశం శనివారం ఎర్రగడ్డలోని ఈఆర్సీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యుత్తు పంపిణీ సంస్థల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. వార్షిక రాబడి వివరాలు (ఏఆర్ఆర్) ప్రతిపాదనలను సకాలంలో సమర్పించడంలో డిస్కంలు విఫలమవుతున్నాయని అన్నారు. ఇది అంతిమంగా వినియోగదారులకు భారంగా మారనుందని పేర్కొన్నారు. సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ ప్రతినిధి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ 2023-24 టారిఫ్‌ను ఈ ఏడాది వసూలు చేసేందుకు అనుమతినిచ్చి 7నెలలుదాటిపోయిందని, ఈ ఐదు నెలలకు టారిఫ్‌ను సవరించాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. ఆలస్యంగా ఏఆర్ఆర్ సమర్పించినందుకు పెనాల్టీలు వేసినా ఆ భారం వినియోగదారులపైనే పడుతుందని తెలిపారు.

చార్జీల పెంపునకు డిస్కంల ప్రతిపాదనలు

ప్రస్తుతం చార్జీల పెంపునకు డిస్కంలు ఈఆర్సీకి చేసిన ప్రతిపాదనలు ఇలా ఉన్నాయి. 2024 -25లో మొత్తంగా రూ.1,200 కోట్లు చార్జీల రూపంలో వసూలు చేసేందుకు డిస్కంలు ప్రతిపాదించాయి. ఎల్‌టీ క్యాటగిరీలో 300 యూనిట్లకు పైగా వాడుతున్న వారికి ప్రతి కిలోవాట్‌కు ప్రస్తుతం వసూలు చేస్తున్న రూ.10ని రూ. 50కు పెంచాలని ప్రతిపాదించాయి. ప్రస్తుతం రూ.30 ఫిక్స్‌డ్ చార్జీలు రూ.150కి పెరగనున్నాయి. ఇది 26 లక్షల మంది వినియోగదారులపై భారం పడనుంది. హెచ్‌టీ క్యాటగిరీలో రూ.7.65లుగా

చార్జీలుగా నిర్ణయించారు. దీంతో 33కేవీ వినియోగదారులకు 50 పైసలు, 132 కేవీ వారికి రూపాయి చొప్పున చార్జీలు పెరగనున్నాయి. కరెంట్ బిల్లుల పెంపుతో రూ.700కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల ద్వారా రూ.100 కోట్లు, మొత్తంగా రూ.800 కోట్లు రాబట్టుకునే అవకాశమివ్వాలని కోరాయి. ఎల్‌టీ ఫిక్స్‌డ్ చార్జీల రూపేణా రూ.400 కోట్ల ఆదాయం పెంపునకు ప్రతిపాదించాయి. దీనిపై ఈఆర్సీ బహిరంగ విచారణ జరపనుంది.

మెడికల్ అడ్మిషన్లలో ఈడబ్ల్యూఎస్ కోటా ఏది?

- వైద్యారోగ్యశాఖను ప్రశ్నించిన హైకోర్టు
- సమాధానం చెప్పాలంటూ అధికారులకు నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్5 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనుకబడిన తరగతుల) రిజర్వేషన్లు అమలు చేయడం లేదంటూ బీజేపీకి చెందిన కామారెడ్డి ఎమ్మెల్యే కే వెంకటరమణారెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం విచారణ ప్రారంభించింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదని అధికారులను ప్రశ్నించింది. దీనిని కోర్టు ధిక్కరణ కింద ఎందుకు పరిగణించరాదో చెప్పాలని నోటీసులు జారీచేసింది. కోర్టుకు హామీ ఇచ్చినప్పటికీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయకపోవడం కోర్టుధిక్కారమే అవుతుందని, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడాన్ని ధిక్కరణ కింద ఎందుకు పరిగణించరాదో తెలియజేస్తూ పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, కాళోజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సంధ్యకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

కోర్టు ఆదేశించినా అమలుచేయరా?

- దీనిని ధిక్కరణగా ఎందుకు పరిగణించరాదు?
- ఇంజనీరింగ్ సీట్ల వివాదంలో హైకోర్టు ప్రశ్న
- విద్యాశాఖకు నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీఎస్సీలో సీట్లు పెంపునకు అనుమతించాలంటూ గతంలో హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులను అమలు చేయలేదంటూ పలు ఇంజినీరింగ్ కాలేజీలు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలను దాఖలు చేశాయి. వీటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. కోర్టు ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని అధికారులకు నోటీసులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించిన తర్వాత కూడా ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆదేశించింది. దీనిని కోర్టు ధిక్కరణగా ఎందుకు పరిగణించరాదో వివరించాలని కోరింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్యా కమిషనర్ ఏ శ్రీదేవసేన, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, టీజీ ఈఏపీసెట్ కన్వీనర్ డాక్టర్ బీ డీన్‌కుమార్‌కు నోటీసులు జారీచేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

నిబంధనలు అమలుచేస్తే స్థానిక కోటాకు అర్హులే

మెడికల్ అడ్మిషన్ల స్థానికతపై హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్5 (నమస్తే తెలంగాణ): నిబంధనల ప్రకారం తెలంగాణలో వరుసగా నాలుగేండ్లు నివాసం ఉండి, అర్హత పరీక్ష నీట్ రాసినట్లయితే మెడికల్ అడ్మిషన్లలలో స్థానిక కోటా కింద పరిగణించాలని కాళోజీ యూనివర్సిటీని హైకోర్టు ఆదేశించింది. 2019 నుంచి తెలంగాణలో ఉంటూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించినప్పటికీ స్థానిక కోటా కింద పరిగణించకపోవడం అన్యాయమంటూ అనమ్తా ఫరూక్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ పదో తరగతి వరకు దుబాయ్‌లో చదువుకున్నాడని, 2019లో తెలంగాణకు వచ్చి ఇక్కడే ఇంటర్మీడియట్ పూర్తిచేశాడని విద్యార్థి తరపు న్యాయవాది చెప్పారు. నాలుగేండ్లుగా స్థానికంగా ఉంటున్నట్టు శేరిలింగంపల్లి ఎమ్మార్వో ధ్రువీకరణ పత్రాన్ని కూడా ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ పిటిషనర్‌ను స్థానికేతరునిగా చూపడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు, పిటిషనర్ వరుసగా నాలుగుండ్లు తెలంగాణలో నివాసం ఉండటంతోపాటు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, నీట్ తెలంగాణలో ఉత్తీర్ణత సాధించినందున మెడికల్ అడ్మిషన్లలో స్థానిక కోటా కింద పరిగణించాలని ఆదేశించింది.

సీఎం చెప్పినా పైసలు ఇయ్యం!

- మహిళల ప్రమాదబీమాకు ఆర్థికశాఖ కొర్రీ
- ప్రీమియం చెల్లింపు ఫైల్ తిరస్కరణ
- 6నెలలైనా అమలుకాని పథకం
- మహిళా సంఘాల విమర్శలు

హైదరాబాద్, అక్టోబరు 5 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించి, ఆదేశాలు జారీ చేసిన ఫైల్‌కే ఆర్థిక శాఖ అధికారులు కొర్రీలు పెడుతున్నారు. సీఎం హామీ ఇస్తే తమకేంటి... అంటూ ఫైల్‌ను తిరస్కరించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.10లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షల లోన్ బీమా కల్పించనున్నట్టుగా సీఎం రేవంత్‌రెడ్డి పరేడ్ గ్రౌండ్ సభలో ప్రకటించారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు లోక్‌సభ ఎన్నికల ముందు ఇచ్చారు. ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించి ఆరు నెలలైనా ఇంత వరకు చెల్లించలేదు. ప్రీమియం నిధుల విడుదలకు ఫైల్ ఆర్థికశాఖకు పంపిస్తే అధికారులు తిరస్కరించినట్టుగా తెలిసింది. రాష్ట్రంలో 50లక్షలకు పైగా మహిళా స్వయం సంఘాల సభ్యులు ఉండటంతో ప్రీమియం మొత్తం ఎక్కువగా అవుతుందని, అంతమొత్తం చెల్లించడం కష్టమని, ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని ఆర్థిక శాఖ అధికారులు సూచించినట్టుగా సమాచారం. దీంతో ఆ పథకానికి ఆదిలోనే హంసపాదు ఎదురైందని, ఇప్పటికే సీఎం పథకాన్ని ప్రకటించినందున అమలు ఎలా చేయాలనే దానిపై సెర్ప్, స్త్రీ నిధి అధికారులు తర్జనభర్జన పడుతున్నట్టుగా సమాచారం. ఆరు నెలలైనా ఇంకా ప్రీమియం చెల్లింపు దశలోనే ఉండటంపై ఎస్‌హెచ్‌జీ సభ్యులు నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పథకం ఇలా...

స్వయం సహాయక సంఘాల సభ్యులకు లోన్ ఇన్సూరెన్స్ కింద స్వయం సహాయక సభ్యురాలు ఏ కారణంగానైనా మరణిస్తే ఆమె చెల్లించే బ్యాంకు లోన్‌ను రెండు లక్షల వరకు ఇన్సూరెన్స్ డబ్బు ద్వారా చెల్లిస్తారు. సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆమె నామినీకి రూ.10లక్షలు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ పథకం అమలు బాధ్యతను స్త్రీ నిధికి అప్పగిస్తూ ఉత్తర్వులు కూడా ఇచ్చారు.

నూతన్‌కల్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

రాణాకెక్కిన కాంగ్రెస్ వర్గపోరు

- ఎమ్మెల్యే సామేల్ ఆదేశాల మేరకే అదుపులోకి
- నూతన్‌కల్ పోలీస్ స్టేషన్ ఎదుట సొంత పార్టీ నేతల ధర్నా

సూర్యాపేట, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): తుంగతుర్తి నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎమ్మెల్యే సామేల్ ఆదేశాల మేరకే తమను స్టేషన్‌కు తరలించారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. సామేల్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పార్టీ కేడర్‌ను కనీసం పట్టించుకోవడం లేదని ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు అర్వపల్లి మండల కేంద్రంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో ఎమ్మెల్యే సామేల్ పోలీసులను ఉసిగొలిపి తెల్లవారుజామున 4 గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల ఇండ్లపై దాడి చేయించి హౌజ్ అరెస్టులు చేయించారని, మరికొందరిని ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారని సీనియర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్వపల్లి, శాలిగౌరారం, నాగారం మండలాలకు చెందిన మోరపాక సత్యం, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనువాస్‌గౌడ్, వేల్పుల రమేశ్, శిగనసీర్ తదితరులను అరెస్టు చేసి దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నూతనకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టులను నిరసిస్తూ.. కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానందచార్యులు స్టేషన్‌కు చేరుకుని అధికార పార్టీ నాయకుల అరెస్టును ఖండించారు.

బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలి

రేవంత్‌రెడ్డికి ఆర్ కృష్ణయ్య బహిరంగ లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రస్తుతమున్న 10 బీసీ కులాల ఫెడరేషన్లను కూడా కార్పొరేషన్లుగా మార్చాలని, ప్రతి కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.1000కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాయడంతోపాటు మీడియాకు శనివారం విడుదల చేశారు. బీసీ శాఖ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ, రజక, వడ్డెర, నాయీబ్రాహ్మణ, వాల్మీకి, భట్రాజు, మేదర, కృష్ణ బలిజ, పూసల, సగర, కుమ్మరి ఫెడరేషన్లు ఉన్నాయని తెలిపారు. ఫెడరేషన్ల నుంచి ఆయా కులవృత్తులకు ఆర్థికసాయం అందిస్తే కేవలం 50శాతం వరకే సబ్సిడీ వస్తుందని, అదే కార్పొరేషన్లుగా మారిస్తే 80శాతం వరకు ఉంటుందని పేర్కొన్నారు. రుణాల పరిమితినీ పెంచాల్సి ఉంటుందని వెల్లడించారు.

సురేఖపై ఇంత రియాక్షన్ అవసరమా?

- ఆమెకు మేమంతా అండగా ఉన్నాం
- ఇష్యూని ఇంతటితో క్లోజ్ చేయాలి
- గురుకుల హాస్టల్స్‌లో వసతులు లేవు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): సమంత, నాగ చైతన్య విషయంలో మంత్రి కొండా సురేఖ్ చేసిన వ్యాఖ్యలను పలువురు సినీ తారలు, రాజకీయ ప్రముఖులు తీవ్రంగా పరిగణించడంపై బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. 'ఇంత రియాక్షన్ అవసరమా?' అని ఆయన ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. నాగార్జున కుటుంబం కోరిక మేరకు మంత్రి కొండా సురేఖ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారని తెలిపారు. అయినప్పటికీ సినీ నటుల నుంచి స్పందనలు ఆగలేదని అసహనం వ్యక్తంచేశారు. బలహీన వర్గానికి చెందిన మంత్రి సురేఖ ఒంటరి కాదని, ఆమెకు తామంతా అండగా ఉన్నామని అన్నారు. తన వ్యాఖ్యలు ఉపసంహరించుకున్న తర్వాత కూడా ఇంత దాడి ఎందుకు అని ప్రశ్నించారు. ఇష్యూని ఇంతటితో క్లోజ్ చేయాలన్నారు. ఈ విషయంపై ఎవరూ మాట్లాడొద్దని పీసీసీ అధ్యక్షుడు కూడా ఆదేశించినట్టు తెలిపారు.

హామీలు అమలుచేశాం

ఇక మహిళల ఉచిత బస్సు, రైతు రుణమాఫీ, డీఎస్సీ, ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని మంత్రి పొన్నం చెప్పారు. ఈ సంవత్సరం మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే బతుకమ్మ చీరల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే బతుకమ్మ చీరలకు రూ.150 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. రెసిడెన్షియ